జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 18-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 342 పేజీలు: 4 వెల : రూ.7




# గ్రానైట్ క్వారీల్లో... బ్లాస్టింగ్‌లు

* నిబంధనలు పాటించకుండా మందుగుండు వాడకం
* గాల్లో కలిసిపోతున్న కార్మికుల ప్రాణాలు
* బయటకు రాకుండా మేనేజ్ చేస్తున్న నిర్వాహకులు
* కొందరు అధికార పార్టీ బడా నేతల చేతుల్లోనే క్వారీలు
* బినామీల పేరిట నిర్వహణ
* మైన్స్ అధికారుల మొక్కుబడి తనిఖీలు
* మెళియాపుట్టిలోని ఓ గ్రానైట్ క్వారీలో ముగ్గురు మృతిపై అనుమానాలు
* కలెక్టర్, ఎస్పీ పర్యటన వెనుక మతలబు ఏమిటోనని విమర్శలు

**శ్రీకాకుళం క్రైం, మే 17 (వార్త):** జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీల్లో భారీ ఎత్తున బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయి. రాళ్లను పేర్చేందుకు పెద్ద ఎత్తున మందుగుండు, జిలెటిన్‌స్టిక్స్ వాడుతున్నారు. వాటిని ఎక్కడి నుంచి తెస్తున్నారో, ఎలా తెస్తున్నారో ఆ పెరుమాళ్‌కే ఎరుక. ప్రస్తుతం జిల్లాలో సుమారు 100కు పైగానే గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. అనుమతులు కొన్నింటికే ఉండగా, వాటిని చూపిస్తూ మరిన్ని కొండలను క్వారీల నిర్వాహకులు పిండి చేసేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అధికార పార్టీలోని బడా నేతలు కనుసన్నల్లోనే ఇవి నడుస్తున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా వీటిని బినామీల పేరుతో నిర్వహిస్తున్నారు. బాంబ్ బ్లాస్టింగ్, రాళ్లు పడి కార్మికులు మృతి చెందుతున్నా బయటకు పొక్కకుండా నిర్వాహకులు మేనేజ్ చేస్తున్నారు. కార్మికులు కుటుంబాలు ఆందోళనకు దిగితే ఎంతోకొంత చేతిలో పెట్టేస్తున్నారు. టెక్కలి, నందిగాం, పొందూరు, కంచిలి, పలాస, సారవకోట మండలాల్లో క్వారీలు ఎక్కువగా ఉన్నాయి. మైన్స్ అధికారులు తరచూ ఈ క్వారీలను తనిఖీలు చేయాల్సివున్నా బడా నేతల కనుసన్నల్లో ఈ క్వారీలు నడుస్తుండడంతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతినెలా ఆ శాఖలో కొందరు ఉన్నతాధికారులకు మామూళ్లు అందుతుండడంతో కన్నెత్తి చూడవద్దని హుకుం జారీ చేసినట్టు ఆ శాఖలోని సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారు. పోలీసులది సైతం అదే పరిస్థితి. మెళియాపుట్టి మండలంలోని ఓ గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. అసలు ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై పోలీసులు, మైన్స్ అధికారులు ఒక స్పష్టత ఇవ్వడం లేదు. మృతుల కుటుంబీకులు మాత్రం బాంబు పేలుళ్ల వద్ద మృతి చెందారని చెబుతున్నారు. అయితే గ్రానైట్ క్వారీ నిర్వాహకులు మాత్రం పిడుగుపడి మృత్యువాత పడ్డారని పేర్కొంటున్నారు. ఎన్నడూ లేని విధంగా కలెక్టర్, ఎస్పీతో పాటు మైన్స్ తదితర శాఖల అధికారులు ఆ సంఘటన స్థలానికి వెళ్లడాన్ని





## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* గ్రానైట్ క్వారీని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
* ప్రమాదం జరిగిన తీరుపై ఆరా

**మెళియాపుట్టి, మే 17 (వార్త):** దీనబంధుపురం గ్రామ సమీపంలో గల గ్రానైట్ క్వారీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఈ సంఘటనపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి మృతి చెందిన వారి కుటుంబీకుల ప్రతి ఒక్కరికి న్యాయం జరిపిస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. క్వారీలో బ్లాస్టింగ్‌తోపాటు అదే సమయానికి పిడుగుపడి ప్రమాదం సంభవించి ముగ్గురు మృతి చెంది ఉంటారని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు తెలియజేస్తూనే, ప్రమాద ఘటన సమాచారం తెలిసిన వెంటనే శుక్రవారం రాత్రి సమయంలో టెక్కలి డివిజన్ ఆర్డీవో పరిధిలో ఒక టీంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శనివారం ఉదయం సంఘటనా స్థలానికి ఆర్డీవో కృష్ణమూర్తితో పాటు టెక్కలి డీఎస్పీ, మైనింగ్ ఏడీ, డిజాస్టర్ టీం, జిల్లా ఫైర్ అధికారి, పోలీసు అధికారులు, స్థానిక తహశీల్దారు, ఎంపీడీవోల బృందం కలిసి ఈ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించినట్టు తెలిపారు. అదేవిధంగా క్లూస్ టీం, ఫారెన్సిక్ టీంలు వచ్చి జరిగిన ప్రమాదాన్ని పరిశీలించి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయంతో పాటు క్వారీ యాజమాన్యంతో మాట్లాడి రావాల్సిన రాయితీలను అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే ఎస్పీ సైతం జిల్లా పోలీసు అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ప్రమాదానికి సంబంధించి దర్యాప్తు చేపట్టేందుకు పలు సూచనలను కింది స్థాయి అధికారులకు సూచించారు. ఆయన వెంట పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు ఉన్నారు.

# జై జవాన్.. జై భారత్

* ఉప్పొంగిన దేశభక్తి
* ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సైనికులకు సెల్యూట్
* ఉగ్రవాదులకు గట్టిగా బుద్ధి చెప్పాం
* వారు ఎక్కడున్నా భారత్ విడిచిపెట్టదు
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* కోటబొమ్మాళిలో తిరంగా యాత్ర

**సంతబొమ్మాళి/కోటబొమ్మాళి, మే17 (వార్త):** ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి మండలం కొత్తమ్మతల్లి ఆలయం నుంచి భారీగా తిరంగా యాత్ర నిర్వహించారు. కూటమి నేతలు, మాజీ సైనికులు జాతీయ జెండాను పట్టుకొని ఈ యాత్రలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పహల్గాంలో అమాయకులపై దాడి చేసిన వారిని మట్టుబెట్టి, దేశ భద్రతపై ఎలాంటి ఆలోచనలు పెట్టుకుంటే ఏమవుతుందో ప్రధాని మోదీ చేసి చూపించారన్నారు. భారత భద్రతా దళాలు పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పిందన్నారు. మహిళల నుదుటి సిందూరాన్ని తుడిచినవారికి గట్టి బదులు ఇచ్చామన్నారు. మన జవాన్లు. సరిహద్దుల్లో కంటికి రెప్పలా కాపలా కాస్తూ, దేశాన్ని రక్షిస్తున్న వారికి సెల్యూట్ చేస్తున్నామని తెలిపారు. సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధానమంత్రి మోదీకి, త్రివిధ దళాధిపతులకు ధన్యవాదాలన్నారు. ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వాళ్ల త్యాగాల వల్లే మనం క్షేమంగా ఉన్నామని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జై జవాన్.... జై భారత్ మాతా అంటూ నినాదాలు చేస్తూ తిరంగా ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో బీజేపీ శ్రీకాకుళం జిల్లా పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ టెక్కలి అసెంబ్లీ కన్వీనర్ అట్టాడ రవిబాబ్జీ, టెక్కలి జనసేన కన్వీనర్ కణితి కిరణ్ కుమార్, టీడీనీ రుతలె బోయిన గోవిందరాజులు, రమేష్, బీజేపీ నాయకులు బూరే నరేంద్ర చక్రవర్తి, రావాడ పురుషోత్తం, మెట్ట తిరుమల రావు, జర్జాన రాంజీ, దూపాన రాజ్‌కుమార్‌రెడ్డి, నడుపూరు లక్ష్మీనారాయణ, బొడ్డేపల్లి దివాకర్, నేతింటి రాజారావుతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనికులు వందలాది మంది పాల్గొన్నారు.



## ఎర్రన్న విద్యాసంకల్పం ద్వారా నేడు మాక్ టెస్టు

**-డీఎస్సీ, కానిస్టేబుల్ పరీక్ష మెయిన్ అభ్యర్థులకు అవకాశం**

**శ్రీకాకుళం, మే 17(వార్త):** ఎర్రన్న విద్యాసంకల్పంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళంలోని ఉమెన్స్ కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో డీఎస్సీ ఎస్జీటీ, కానిస్టేబుల్ మెయిన్స్ అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత, ఆఫ్ లైన్ మాక్ టెస్టులు నిర్వహించనున్నారు. అభ్యర్థులు WWW.YVSSRIKAKULAM.LIVE లింక్‌ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్ వాస్తవిక పరీక్ష వాతావరణానికి అనుభవం కలిగిస్తుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.




# పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకూర్మంలో పర్యటన**

**గార, మే 17(వార్త):** శ్రీకూర్మంలో శనివారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి పారిశుధ్య పరిస్థితులపై అధికారులను ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గమనించిన ఆయన, తక్షణమే వాటిని తొలగించాలంటూ ఆదేశించారు. అనంతరం సమీప వీధుల్లోకి వెళ్లిన కలెక్టర్, తడి-పొడి చెత్త వేరు చేసే అంశంపై స్థానికులను ప్రశ్నలు అడిగి వారికి అవగాహన కల్పించారు. పెద్ద దల్లాం చెరువు పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించారు. అవసరమైన వసతులు అందేలా చూడా లని సూచించారు. సీసీ రోడ్డు పనులలో భాగంగా జరుగుతున్న వాటర్ క్యూరింగ్ పరిస్థితులను పరిశీలించారు. పనుల నాణ్యతపై విచారణ చేస్తూ




తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఓ భారతీసౌజన్య, గార స్పెషల్ ఆఫీసర్ శాంతిశ్రీ, ఎమ్మార్వో ఎం.చక్రవర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోష్ చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి






**శ్రీకాకుళం, మే 17(వార్త):** శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పోష్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటవ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం, పోష్ చట్టంపై అవగాహన కల్పించారు. ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు అన్ని పని ప్రదేశాల్లో ఈ చట్టం వర్తిస్తుందని, అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయడం, దర్యాప్తు ప్రక్రియలు పాటించడం తప్పనిసరని వివరించారు. నిబంధనలు పాటించనివారిపై జరిమానాలు విధించే అధికారం ఈ చట్టానికి ఉందన్నారు.

కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, న్యాయ వాది జి.ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**పలాస, మే 17(వార్త):** పారా లీగల్ వాలంటీర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించామని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తెలిపారు. పోష్ చట్టం, పనిచేసే చోట మహిళలపై వివక్షత, అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు.

వేదనకు గురైన మహిళ 3 నెలల్లోగా తన దరఖాస్తును తన కార్యాలయ అధికారికి లేదా జిల్లాలో ఏర్పాటు చేసిన మహిళల అత్యాచార నిరోధక కమిటీ వారికి తెలియపరచవచ్చన్నారు. ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు ఈ అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ఏ ఒక్క మహిళా ఉద్యోగి కూడా తన పనిచేసే చోట ఇబ్బంది పడకూడదని సూచించారు. సమస్యకు గురైన మహిళలు న్యాయ సేవా సంఘానికి లేదా ఉచిత న్యాయ సహాయం టోల్ ఫ్రీ నెంబర్ 15100కు లేదా 112, 181 నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు బి.కామేశ్వరరావు పట్నాయక్, బి.రవికుమార్, వి.రవి, కె.రజనీకుమార్, సీనియర్ న్యాయవాదులు టి.శ్యాంసుందర్ రావు, పి.జి.రాజారత్నం, పి.వెంకటరావు, కె.లోకేశ్వరరావు, పి.చిట్టిబాబు, పారా లీగల్ వాలంటీర్ బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.


## సోంపేట కళింగ సంక్షేమ సంఘానికి

# నూతన పాలకవర్గం

- గౌరవ ముఖ్య సలహాదారునిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్
- గౌరవ అధ్యక్ష, ప్రెసిడెంట్‌గా పంది కృష్ణారావు, శేషయ్య
- త్వరలో కొలువు దీరనున్న కార్యవర్గం

**సోంపేట, మే 17(వార్త):** సోంపేట పట్టణ కళింగ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం రాత్రి ఏకగ్రీవంగా ఎంపికైంది. గౌరవ ముఖ్య సలహాదారు లుగా డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా పంది కృష్ణారావు, అధ్యక్షునిగా తమ్మినేని శేషయ్య, ఉపాధ్యక్షునిగా పొందూరు శ్రీధర్, కార్యదర్శిగా వజ్జ కృష్ణారావు, సంయుక్త కార్యదర్శులుగా పైడి సునీల్, పంది రమణమూర్తి, కోశాధికారిగా దుప్పల చలపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ కోఆర్డినేటర్లుగా భావన శ్రీకాంత్, వెదుళ్ల తిరుపతిరావు, మాదిన ప్రసాద్‌ను కమిటీ ప్రతిపాదించింది. బమ్మిడి రుక్మంగదరావు, పంది సురేష్‌ను కమిటీ శాశ్వత సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో త్వరలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించి, సామాజిక, సంఘ కార్యక్రమాల భవిష్యత్తు ప్రణాళికను, వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేయనుంది. జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుంట లచ్చయ్య, అన్నెపు వల్లభరావు, బెండాళం రమణమూర్తి, ముఖలింగం స్వామి తదితరులు పాల్గొన్నారు.





## శివ్వాలను సత్కరించిన బోనెల

**సరుబుజ్జిలి, మే 17(వార్త):** డీసీసీబీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన శివ్వాల సూర్యనారాయణను స్టేట్ ఎస్సీ సెల్ డైరెక్టర్ బోనెల అప్పారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించారు. 42ఏళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు సరైన గుర్తింపు లభించిందన్నారు. భవిష్యత్‌లో మంచి స్థానానికి వెళ్లాలని ఆశిస్తున్నానన్నారు.

## ఉపాధ్యాయ ఐక్య పోరాటానికి ఏపీసీపీఎస్ఈఏ మద్దతు

**శ్రీకాకుళం, మే 17(వార్త):** రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఈ నెల 21 నుంచి చేపట్టబోతున్న ఐక్య పోరాటానికి ఏపీసీపీఎస్ఈఏ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘ నేతలు తెలిపారు. ఈ పోరాటంలో సంఘ సభ్యులందరూ భాగమవ్వాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు.

## గుండను పరామర్శించిన చల్లా



**శ్రీకాకుళం, మే 17(వార్త):** మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి దంపతులను శనివారం బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## 20న టీడీపీ మినీమహానాడు

**పాతపట్నం, మే 17 (వార్త):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఈనెల 20న పాతపట్నంలోని తన నివాసం వద్ద మినీమహానాడు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

## ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో

# ఉచిత ప్రయాణం

- అన్ని నియోజకవర్గాల్లో రైతుబజార్లు
- ప్రతి ఒక్కరూ అరగంట యోగా చేయాలి
- సీఎం చంద్రబాబు

**కర్నూలు, మే 17 (వార్త):** ఆగస్టు 15 నుంచి మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కర్నూలులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై, ఉద్యోగులు కార్యాలయాల శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు గిట్టుబాటుధర, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు రైతుబజార్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కర్నూలు సి క్యాంప్ రైతు బజారును రూ.6 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. పక్కనే ఉన్న స్థలంలో అండర్ గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు 125 రైతు బజారులు ఉన్నాయని తెలిపారు. రైతు బజార్లకు సేంద్రియసాగులో పండించిన కూరగాయలు వచ్చేలా చూస్తామన్నారు. ప్రపంచం గర్వించేలా విశాఖలో యోగా డే నిర్వహిస్తామని, ప్రధాని మోదీ కూడా వస్తున్నారని చెప్పారు. యోగా డేను నెలరోజులపాటు నిర్వహిస్తామని, ప్రజలకు శిక్షణ కూడా ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట యోగా చేసినట్టయితే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించామన్నారు. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నామని తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పలాస, మే 17(వార్త):** విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం ఏర్పడు తుందని పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమత్తులు, 11కేవీ చినబాడాం ఫీడర్ మీద కొత్త విద్యుత్ లైన్లు డిఎస్ఎస్ వేయుటకు విద్యుత్ నిలుపుదల చేస్తామన్నారు. అనంతపురం, జిఎంఈ, కొబ్బరి చెట్లూరు, ఆర్ కె పురం, పెంటిబద్ర, జయారంచంద్రపురం, పద్మ నాభపురం, పాత జాకీ రోడ్డు 5, తాలభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులంతా సహక రించాలని విజ్ఞప్తి చేశారు.



## టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన పలాస కమిషనర్ రామారావు

**పలాస, మే 17(వార్త):** బీ.సీ. కార్పొరేషన్ ద్వారా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో బీసీ మహిళలకు ఇస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని కమిషనర్ నడిపేన రామారావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము ప్రతిరోజు శిక్షణ కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేయాలని, శిక్షణ పొందుతున్న మహిళలు 75 శాతం హాజరు ఉండాలని తెలియజేశారు. ఈ శిక్షణ కాలము మొత్తం 90 రోజులు పూర్తి జరిగిన తర్వాత సర్టిఫికెట్ తో పాటు ఉచిత కుట్టు మిషన్ కూడా ఇవ్వడం జరుగుతుందని కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం




**ఇచ్ఛాపురం, మే 17(వార్త):** స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వి అర్ వో ల భవనం వద్ద తహసీల్దార్ వెంకట రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రంగాల శ్రీనివాస్ రెడ్డి, నీలవేణి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## సునాముది ఛానల్ అభివృద్ధికి కృషి



**మందస, మే 17(వార్త):** మందస రైతులకు ఎంతో ఉపయోగపడే సునాముది చానల్ అభివృద్ధి చేస్తామని జనసేన నాయకులు అన్నారు. ఈ మేరకు జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు, మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్చార్జి దువ్వాడ వంశీకృష్ణ చౌదరిలు మందస మండలంలోని సునాముది కాలువలు, చెక్ డామ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు, మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు, వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇన్చార్జి దువ్వాడ వంశీకృష్ణ చౌదరి మాట్లాడుతూ సునాముది ఛానల్ పై చెక్ డాం, షట్టర్ మరమ్మత్తులు చేయిస్తామన్నారు. మందస మండలానికి జీవధార సునాముది ఛానల్ పై దిమిరియా గ్రామం దగ్గర శిథిలావస్థలో ఉన్న చెక్ డాం, షట్టర్ లపై ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడామని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు వారు పంపారని, నిధులు విడుదలైన వెంటనే మరమ్మత్తులు చేసి ఆయికట్టు రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.



## దివ్యాంగ చిన్నారుల గుర్తింపునకు ఇంటింటా సర్వే

**మందస, మే 17(వార్త):** దివ్యాంగ చిన్నారులు గుర్తింపునకు ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మందస మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మణరావు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా 0 నుంచి 18సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ఇంటింటి సర్వే కార్యక్రమం ఈనెల 13 నుండి జూన్ 9వ తారీకు వరకు కొత్తగా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. 0 నుంచి 18సంవత్సరాలు నిండిన పిల్లలు వినికిడి లోపం, దృష్టిలోపము, మానసిక లోపము తదితర 21 రకాల వైకల్యాలను ఎక్కడైనా ఉన్నా సరే వారిని గుర్తించి వారికి స్కూల్ వయస్సు వచ్చే వారిని స్కూల్లో జాయిన్ చేయడం, అంగన్వాడి వయస్సు వచ్చే వారిని అంగన్వాడిలో జాయిన్ చేయడం కొరకు వారినీ చేర్పించే కార్యక్రమం మండలంలో చేపట్టడం జరుగుతుందన్నారు. చేర్పించిన అనంతరం ప్రభుత్వం అందించినటువంటి పరికరాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, స్కూలుకు వెళ్లే పిల్లల్ని వివిధ రూపంలో అలెవెన్స్ రూపంలో సహాయం చేయడానికి ప్రభుత్వం విద్యాశాఖ తరపున పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉండే



ప్రత్యేక అవసరాలు పిల్లలు సమాచారం ఆశా వర్కర్స్, అంగన్వాడి వర్కర్స్, ఉపాధ్యాయులు ఎవరైనా సరే కొత్తగా నమోదయిన పిల్లలు వివరాలను తప్పనిసరిగా మండల విద్యాశాఖకు అందజేయగలరని కోరారు. మరింత సమాచారం కొరకు ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులు ఫోన్ నెంబర్ 9182976342 కిల్లి ప్రసాదరావు, బమ్మిడి అంబిక 7075755758 . ఫోన్ నెంబర్స్ కు సంప్రదించగలరని ఆయన సూచించారు.



## గిరిజన యువత శ్రమదానం

**మందస, మే 17(వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన తెంతులిగాం రహదారికిరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లడొంకలతో నిండిపోయింది. ప్రయాణీకుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో రోడ్డును గిరిజన యువకులు, మహిళలు బాగు చేయడానికి ముందుకు వచ్చారు. సర్పంచ్ సవర నవిత ఆధ్వర్యంలో జడ్పీటీసీ సవర చంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి రవి, సవర బాలకృష్ణ, మోహన్, నాగేశ్, ఆది, సీతారాం తదితరుల ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను ముళ్ల పొదలను తొలగించారు. గోతులున్న చోట మట్టివేసి సరి చేశారు. గిరిజన గ్రామాలను కలిపే ఈ రహదారికి ఎంతో ప్రాధాన్యత ఉందని, అటువంటి రహదారి ప్రయాణీకులకు ఇబ్బందికరంగా మారడంతో శ్రమదానంతో బాగు చేసుకుంటున్నామని వారు చెప్పారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, ఎదురు చూడకుండా గిరిజనులు తమ రహదారి తామే బాగు చేసుకోవడంతో అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

## నిత్యావసరాల డోర్ డెలివరీకి టెండర్ల ఆహ్వానం

**శ్రీకాకుళం, మే 17(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లాలో నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని మూడు మండలాల పరిధిలో గల చౌక ధరల దుకాణా లకు, గ్రామ/వార్డు సచివాలయాలకు నిత్యావసర సరుకులను నేరుగా లబ్ధిదారుల గడప వద్దకే చేర్చేందుకు (రెండో దశ రవాణా) కాంట్రాక్టర్లను నియ మించనుంది. ఈ మేరకు సంస్థ సంయుక్త కలెక్టరు ఫర్మాన్ అహ్మద్ ఖాన్ టెండర్లను ఆహ్వానించారు. ఈ టెండర్లు జి.సిగడాం, మెళియాపుట్టి, సరుబుజ్జిలి మండలాలకు వర్తిస్తాయి. ఆసక్తి కలిగిన కాంట్రాక్టర్లు జిల్లా పౌరసరఫరాల మేనేజరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీకాకుళం వారి పేరున రూ.5000ల డిమాండ్ డ్రాఫ్ట్‌ను చెల్లించి, టెండర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు, విధి విధానాలు, టెండర్ ఫారమ్‌ను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్లను ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయడానికి చివరి తేదీ ఈ నెల 22 సాయంత్రం 4:30 గంటలుగా నిర్ణయించబడింది. టెండర్ల ప్రక్రియలో భాగంగా బిడ్ డాక్యుమెంట్లను ఈ నెల 17 ఉదయం 10:00 గంటల నుంచి 22 సాయంత్రం 4:00 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకో వచ్చు. బిడ్లను దాఖలు చేయడానికి చివరి గడువు ఈ నెల 22 సాయంత్రం 4:30 గంటలు. టెక్నికల్ బిడ్‌లను ఈ నెల 22 సాయంత్రం 5:30 గంటలకు, ఆర్థిక బిడ్‌లను (అర్హత సాధించిన వారికి మాత్రమే) ఈ నెల 23 ఉదయం 11:00 గంటలకు తెరవను న్నారు. ఈ టెండర్లు, ఇతర వివరాలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే, జిల్లా పౌరసరఫరాల మేనే జరు కార్యాలయంలోని సహాయ మేనేజర్‌ను 7732098637 నెంబరు ద్వారా సంప్రదించగలరు. ప్రభుత్వం నిత్యావసర సరుకులను ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చర్యలు తీసుకుంటోంది.

## హరిపురం బజార్ వీధి .. ప్రజలు బేజార్

**మందస, మే 17(వార్త):** మందస మండలంలోని హరిపురం పెద్ద వ్యాపారకేంద్రం. మందస కంటే హరిపురం ఎక్కువగా అభివృద్ధి చెందుతోంది. మందస నుంచి కూడా ప్రజలు హరిపురం బజార్ కు వెళు తుంటారు. అటువంటి హరిపురం బజార్ వీధి సెల్ టవర్ ఆవరణలో డ్రైనేజీలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలతో డంపింగ్ యార్డ్ కంటే దారుణంగా తయారయ్యింది. బజార్ వీధిలో డ్రైనేజీ సిస్టం బాగోలేక చాలా కాలంగా ఉన్నటువంటి ఈ సమస్య ను పూర్తిగా పరిష్కరించాలని ఎన్నోసార్లు పంచాయతీ పాలకవర్గానికి ఆ చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రజలు కోరారు. ముఖ్యముగా అరసవల్లి మోహనరావు చాలాసార్లు ఈ సమస్య మీద పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలకు, పంచాయతీ పెద్దలకు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించే నాథుడే కరువయ్యాడు. సమస్య తీర్చలేక పోవడం చాలా దారుణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పంచాయతీ ఈ సమస్యను శాశ్వతంగా వర్షాలు పడే ముందు పరిస్కరించాలని పంచాయతీ సిబ్బందిని స్థానికులు కోరుతున్నారు. ముందుగా చెత్తను పంచాయతీ పారిశుద్ధ కార్మికులచే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.



## పంప్ హౌస్‌ను పరిశీలించిన ఇంజినీరింగ్ అధికారులు

**ఇచ్ఛాపురం, మే 17(వార్త):** పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ పి కామేశ్వర రావు మరియు సుడా ఈ ఈ సుగణకర్ రావు లు సంత పేట వద్ద ఉన్న పంపు హౌస్ ను పరిశీలించారు.పంపు హౌస్ ను బాగుచేసి, ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు కార్యాలయం లో జరుగుతున్న పలు రకాల పనులు పై కమిషనర్ ఎన్ రమేష్ ఎ.ఇ లు మరియు వార్డు అమెనిటీస్ సెక్రేటరీలతో చర్చించారు. సమావేశంలో డి. ఇ సుధాకర్, ఎ. ఇ జగనాధం, అవినాష్ పాల్గొన్నారు.





**ఇచ్ఛాపురం, మే 17(వార్త):** రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర బి స్వచ్ఛ ఆంధ్ర" అనే కార్యక్రమమును ప్రతి నెల మూడవ శనివారమున నిర్వహించవలసినదిగా ప్రభుత్వము ఆదేశముల మేరకు పురపాలక సంఘ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వము మే నెల మూడవ శనివారమునకు సంబందించి ప్రకటించిన థీమ్ ,బీట్ దీ హీట్ అనే కార్యక్రమములో భాగముగా మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆద్వర్యంలో సురంగి రాజ గ్రౌండ్ మరియు వై యస్ ఆర్ కళ్యాణ మండపం వద్ద మార్నింగ్ వాకర్స్ తో ,క్రీడాకారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగినది. ఎండలు బాగా పెరిగినందువలన ప్రజలు జాగ్రత్తలు తీసుకొనవలెనని తెలియజేసారు. ప్రజలు ఎండబారిన పడకుండా తరచుగా మజ్జిగ, మంచినీరు, ఓ.ఆర్.యస్. మొదలగునవి తీసుకొనవలెనని తెలిపారు. ప్రజలకు అందుబాటులో మంచి నీరు త్రాగుటకు మున్సిపల్ కార్యాలయంనకు ఎదురుగా చలి వేంద్రము కూడా ఏర్పాటు చేసి ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా బెల్లుపడ మండపం వద్ద డ్వాక్రా మహిళలతో చైర్ పర్సన్ రాజ్యలక్ష్మి ఆద్వర్యంలో ఆవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో కాకుండా ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రాకూడదని, తరచూ మంచి నీరు తాగుతూ ఉండడం వలన శరీరం డీ హైడ్రేషన్ కాకుండా ఉంటుందని, ఎండల వలన వడదెబ్బ బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమములో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ పోరిడా, సచివాలయ శానిటరీ సెక్రెటరీలు, శానిటరీ మేస్త్రిలు, మునిసిపల్ సిబ్బంది, మెప్మా మరియు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# వాడవాడలా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర




**ఆమదాలవలస, మే 17(వార్త):** ఆమదాలవలస మున్సిపాలిటీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవి కుమార్ మున్సిపాలిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యంచ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది, కూటమి ముఖ్య నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, మే 17(వార్త):** దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైదిక సిబ్బంది, పాల సేవ కార్యకర్తలు ఆలయ ప్రాంగణం, పరిసరాలు శుభ్రపరిచారు. కార్యక్రమములో ఆలయ సూపరింటెండెంట్ యస్.కనకరాజు, శీకాకుళం టూరిజం డిపార్ట్మెంట్ అధికారి నారాయణరావు పాల్గొన్నారు.



**పలాస, మే 17(వార్త):**
ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నగరాలు, పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసు కుంటోందని ప్రతి ఒక్కరూ సహకరించాలని పలాస జనసేన పార్టీ సమన్వయకర్త డా.దుర్గారావు కోరారు. శనివారం ఆయన స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా క్లస్టర్ ఇన్‌చార్జి వంశీకృష్ణ చౌదరి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఫారెస్ట్ సిబ్బందితో కలిసి కాశీబుగ్గ నగరవనం పరిసరాల్లో చెత్తను, ప్లాస్టిక్‌ను తొలగించి, పరిసరాలను పరిశుభ్రం చేసి, స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పలాస, మే 17(వార్త):** స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'హీట్ ది బీట్'ని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి కమిషనర్ నడిపేన రామారావు శనివారం నిర్వహించారు. ప్రజలకి ఎండ తీవ్రత, వడదెబ్బల నుంచి ఎలా ఊరట చెందాలో అవగాహన కల్పించారు. 31 సచివాలయాల పరిధిలో ఆరోగ్య కేంద్రాలు, తాగునీరు, షామి యానాలను ఏర్పాటు చేశారు.కాశీబుగ్గ అక్కుపల్లి సెంటర్లో చెట్లు నాటారు. అక్కుపల్లి జంక్షన్ లో చలివేంద్రంతో పాటు ప్రజలు ఎండను బారిన పడకుండా గొడుగులను కూడా కమిషనర్ ఏర్పాటు చేశారు.





## మొక్కలతోనే మానవ మనుగడ

**-గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి**

**మందస, మే 17(వార్త):** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనంతోనే మానవుల మనుగడ సాధ్యపడుతుందని మందస శాఖా గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులచే నీరు మీరు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా లైబ్రేరియన్ విజయలక్ష్మి మాట్లాడుతూ చెట్లను నరికి వేస్తుండడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే పరిస్తితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పెంచి, పెద్ద చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రంథాలయం గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నర్తు రామారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పాస్టర్లు




**ఇచ్ఛాపురం, మే 17(వార్త):** ఎమ్మెల్సీ నర్తు. రామారావు కు ఇచ్చాపురం నియోజక వర్గం పాస్టర్ ఫెలోషిప్ జన్మదిన శభాకాంక్షలు తెలియజేసింది. ప్రార్ధనలు నిర్వహించారు, పాస్టర్. ఏలీయా పాస్టర్. బిమో బెహరా , శేఖర్ మరియు విశ్వాసుకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు . ఏ పి పాస్టార్స్ పెడరేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు.

## కిచెన్ గార్డెన్ కంపోస్ట్ పిట్స్‌పై మహిళలకు అవగాహన

**మందస, మే 17(వార్త):** ప్రభుత్వం స్వచ్ఛంద, స్వర్ణాంధ్ర ప్రదేశ్ లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కు కిచెన్ గార్డెన్, కంపోస్ట్ పిట్స్ పై అవగాహన కల్పిస్తూ, జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో నిర్మించుకోవాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. స్థానిక మందస పంచాయతీ పరిధిలో గల గ్రామ సంఘం లో మహిళా సంఘాల పుస్తక నిర్వహణను పరిశీలిస్తూ మాట్లాడారు. ప్రతి జాబ్ కార్డు ఉన్న కుటుంబం కూడా తప్పనిసరిగా కిచెన్ గార్డెన్, కంపోస్ట్ పిట్స్ నిర్మించుకుని ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛంద, స్వర్ణాంధ్ర ప్రదేశ్ నిర్మాణం లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, గ్రామ సంఘం మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

* ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు సురక్షిత ప్రయాణం కోసమే 'సురక్ష క్యూ ఆర్ కోడ్ స్కాన్ యాప్' * ఆటో రికార్డుల నమోదుకు డ్రైవర్లకు ప్రత్యేక డ్రైవ్ * మీ రక్షణ.. మా బాధ్యత * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * సురక్ష క్యూ ఆర్ కోడ్ స్కాన్ యాప్ లాంఛనంగా ప్రారంభం

# మీ భద్రత.. మీ చేతుల్లోనే!







**శ్రీకాకుళం క్రైం, మే17 (వార్త):** ఆటో డ్రైవర్లు, ఆటోలో ప్రయాణం చేసే ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణం కోసం సురక్ష క్యూఆర్ కోడ్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు, మహిళలు, విద్యార్థులు భద్రత దృష్ట్యా, ట్రాఫిక్ నియంత్రణ, ఆటోలో ప్రయాణించే ప్రయాణీకులు, చోదకులు భద్రత ప్రాధాన్యతగా భావించి జిల్లా ఎస్పి ప్రతిష్టాత్మకంగా సురక్ష క్యూఆర్ కోడ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో శనివారం స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో భాగంగా సురక్ష క్యూ ఆర్ కోడ్ స్కాన్ యాప్‌ని జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని లాంచనంగా ప్రారంభించారు. అనంతరం కోడి రామమూర్తి స్టేడియంలో ఆటో వాహనాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ యాప్ స్టిక్కర్లని జిల్లా ఎస్పీ అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు ముఖ్యంగా మహిళలు, ఆటో డ్రైవర్లు భద్రత సురక్షితమైన ప్రయాణం కోసం ఈ సురక్ష క్యూ ఆర్ కోడ్ స్కాన్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సురక్ష క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆటో డ్రైవర్, ఓనర్ వివరాలు, ఆటో ప్రయాణించే దిశ, రోడ్డు మార్గం, లొకేషన్ తదితర పూర్తి వివరాలు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుమారు 26 వేల ఆటోలు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రస్తుతం 20 వేల ఆటోలు రవాణాలో ఉన్నాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రజలు వారి అత్యవసర అవసరాలు నిమిత్తం ఎక్కువగా ఆటో వాహనాలను వినియోగించడం జరుగుతుందని, రహదారులు చిన్నవిగా ఉండటంచే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ యాప్ మరింతమంది ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు డ్రైవర్లు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. శక్తి యాప్ తో ఈ సురక్ష యాప్ ను రానున్న రోజుల్లో అనుసంధానం చేస్తామన్నారు. ఆటో యాజమాన్యులు విధిగా కేటాయించిన ఆటో స్టాండ్ నందు, పార్కింగ్ ప్రదేశాలలో ఆటోలు పార్కింగ్ చేసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని తెలిపారు. అనంతరం ఈ సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్ రూపకల్పన చేసిన ఐటీ కోర్ ఏఎస్ఐ బి.రమేష్, ఉత్తమ ఆటో డ్రైవర్లు భాస్కరరావు, శ్రీనివాసరావుకు ప్రత్యేకంగా జిల్లా ఎస్పీ అభినందించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ట్రాన్స్పోర్ట్ కమిషర్ విజయ సారథి, అదనపు ఎస్పి కెవి రమణ,డిఎస్పీ సీ.హెచ్.వివేకా ఆనంద్, ఎం.విఐ గంగాధర్, సీఐలు పైడిపు నాయడు, ఈశ్వర్ రావు, అవతారం, శ్రీనివాసరావు, సత్య నారాయణ, నాగరాజు, ఎస్సైలు, ఆటో చోదకులు పాల్గొన్నారు.











Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546